క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరడిగొండ: నేరడిగొండ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నేరడిగొండ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కార్డియాలజిస్ట్‌పై ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ సూపర్ స్పెషాలిటీ కార్డియాలజిస్ట్ హరిబాబుపై ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రహ్లాద్ వర్మ రిమ్స్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం తన కుమారుడికి శ్వాస ఆడటం లేదని టూడీ ఇకో తీయించాలని ఇతర వైద్యులు చెప్పినట్లు కార్డియాలజిస్ట్‌కు చెబితే అసభ్య పదజాలంతో దూషించినట్లు పేర్కొన్నాడు.

'ఫైనాన్స్ వ్యాపారాన్ని అరికట్టాలి'

ఇచ్చోడ: ఇచ్చోడ మండలంలో ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారాన్ని అరికట్టాలని నాయికపోడ్ సంఘం మండల కార్యదర్శి కర్నాల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో కొంత మంది ఫైనాన్స్ వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేస్తూ.. గిరిజనులను ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. దీంతో చిరు వ్యాపారులు వడ్డీలు కట్టలేక నష్టపోతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఫైనాన్స్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కబడ్డీ పోటీలు

బేల: మండలంలోని సదల్‌పూర్ గ్రామ శివారులోని భైరందేవ్, మహాదేవ్ ఆలయాల ఆవరణలో కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. 35 జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం పలు జట్లు తలపడ్డాయి. కబడ్డీ పోటీలు ఆదివారం పూర్తి కానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి సిడాం కుషాల్ రావు తెలిపారు.

నిధులు మంజూరు

బోథ్: బోథ్ నియోజకవర్గంలోని పలు రోడ్లకు రూ. 16.16 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. భీంపూర్ మండలంలోని ఎన్‌హెచ్ 44 నుంచి గుబిడి గ్రామానికి రూ. 6 కోట్లు, బజార్‌హత్నూర్ మండలంలోని డెడ్రా నుంచి ఇచ్చోడ వరకు రూ.4.08 కోట్లు, ఇచ్చోడ–డెడ్రా రోడ్డు నుంచి లక్ష్మీనాయక్ తండా, కొత్తపల్లి వరకు రూ. 2.40 కోట్లు, బజార్‌హత్నూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి చింతకర్ర, అందుగూడ వరకు రూ. 2 కోట్లు, గుడిహత్నూర్ మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి తోయగూడ వరకు రూ.1.68 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.

పట్టణ స్వర్ణకార సంఘం కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణ స్వర్ణకార సంఘం కార్యవర్గాన్ని శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉదారి నగేష్, ప్రధాన కార్యదర్శిగా తిప్పర్తి సత్యం, సభ్యులుగా ఉదారి దయానంద్, నూనె యాదవ్, అనుసూరి అనిల్, రావుల వేణు, ఉదారి చిరంజీవి, సజ్జనపు లక్ష్మణ్, రాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కాటోజి భాస్కర చారి, ఉదారి శేషన్న, కట్ట క్రిష్ణస్వామి పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన రాథోడ్ సంతోష్ తల్లి జనాబాయి ఇటీవల మృతి చెందగా.. బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌లు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, ఎంపీటీసీలు ఉన్నారు.

సమావేశానికి హాజరుకావాలి

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ఈనెల 29న నిర్వహించిన సీపీఐ నియోజకవర్గ సమావేశానికి కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాయలంలో మాట్లాడారు. ఇందులో ప్రజా సమస్యలు, పరిష్కారాలు, పార్టీ బలోపేతంపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, దాస్, షేక్ షాకీర్, సుమేర్ పాషా, భోజన్న పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ఆత్మరక్షణ శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో ఆత్మరక్షణ శిక్షణ నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్‌లో భాగంగా జిల్లాలోని 138 పాఠశాలల్లో నెల పాటు శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నా రు. బాలికలకు కరాటే, ఆత్మరక్షణలో శిక్షణ ఇచ్చేందుకు శిక్షకులు అవసరమని, ఆసక్తిగల వారు ఈనెల 22లోగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిద్రపోతున్న నిఘా నేత్రాలు

- మండల కేంద్రంలో పని చేయని సీసీ కెమెరాలు
- కొరవడిన పోలీసుల పర్యవేక్షణ
- నెలలు గడుస్తున్నా.. పట్టించుకోని వైనం

సిరికొండ: మండల కేంద్రంలో దొంగతనాలు, ఘటనలు జరగకుండా, ఏదైనా ఘటన జరిగినా.. వెంటనే నిందుతులను గుర్తించేందుకు నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు అవగాహన కల్పించడంతో 2018లో సిరికొండ గ్రామాభివృద్ధి కమిటీ సుమారుగా రూ. 2లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రధాన కూడళ్ల వద్ద 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటులో వ్యాపారులు కూడా సాయం అందించారు.

సీసీ కెమెరాలతో ఏర్పాటు..

మండల కేంద్రంలో 12 కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతను పోలీసులు చూసుకుంటున్నారు. ఇంత ఖర్చు చేసి ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు మున్నాళ్ల ముచ్చటగానే మారింది. గత కొన్ని నెలల నుంచి పని చేయకపోవడంతో మండల కేంద్రంలో నిఘా కొరవడింది. ఏదైనా దొంగతనాలు జరిగితే ఎలా అని మండల వాసులు ఆందోళన చెందుతున్నారు.

చోరీకి గురవుతున్న వాహనాలు

మండల కేంద్రంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో గత కొన్ని రోజుల క్రితం మండలానికి చెందిన విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. తన ఇంటి సమీపంలోనే పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా పని చేయకపోవడంతో నిందితులను పట్టుకోవడం పోలీసులకు సాధ్యపడలేదు. మరో ఘటనలో వైన్స్ వద్ద బైక్ చోరీకి గురైంది. సమీపంలో ఉన్న సీసీ కెమెరా పని చేయకపోవడంతో దొంగను గుర్తించ లేక పోయారు. సీసీ కెమెరాలు పని చేస్తే దొంగలను గుర్తించి, బాధితులకు బైక్ అప్పగించే అవకాశం ఉండేది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సిరికొండలో పని చేయని సీసీ కెమెరా

వినియోగంలోకి తీసుకొస్తాం

మండల కేంద్రంలో సీసీ కెమెరాలు గత కొన్ని రోజుల నుంచి పని చేయడం లేదు. కెమెరాలకు త్వరలోనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువస్తాం. అంతేకాకుండా మరికొన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం.

– నీరేష్, ఎస్సై, సిరికొండ

మరమ్మతులు చేయాలి



మండల కేంద్రంలో పని చేయకుండా నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలి. సీసీ కెమెరాలు పని చేస్తే నేరాలు జరిగితే నిందితులను వెంటనే గుర్తించి, శిక్షించే అవకాశం ఉంటుంది. నేరాలు, దొంగతనాలు కూడా అదుపులోకి వస్తాయి.

– అశీల మధు, మెడికల్ వ్యాపారి, సిరికొండ

పట్టించుకోవడం లేదు



గ్రామాభివృద్ధి కమిటీ నిధులు సేకరించి ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే పని చేయడం లేదు. మరమ్మతుల విషయంలో ఎవరూ పట్టించుకోవడం లేదు. సీసీ కెమెరాల ఏర్పాటు మున్నాళ్ల ముచ్చటగానే మారింది.

– సూర్యవంశీ దత్తురాం, సిరికొండ

అటెన్షన్ ప్లీజ్

శిథిలావస్థలో విద్యుత్ స్తంభం



బోథ్: మండల కేంద్రంలోని 14వ వార్డులో ఖాసీమొద్దిన్ ఇంటి పక్కన గల విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరింది. ఏ సమయంలోనైనా పోల్ కూలే ప్రమాదం ఉంది. విద్యుత్ అధికారులు స్తంభాన్ని తొలగించి, నూతన స్తంభం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి:
శ్రీనివాస్, విద్యుత్ శాఖ, ఏఈ, బోథ్,
ఫోన్: 94408 11701

కేసులు పరిష్కరించుకోవాలి

- జిల్లా జడ్జి సునీత

ఆదిలాబాద్‌టౌన్: లోక్ అదాలత్‌లో బీమా కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి సునీత అన్నారు. శుక్రవారం కోర్టులో వివిధ బీమా కంపెనీలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా అత్యధికంగా బీమా కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. పరస్పర ఒప్పందంతో కేసులు పరిష్కారమవుతాయని, దీంతో సమయం వృథా కాదన్నారు. సమావేశంలో జడ్జిలు మంజుల సూర్యవార్, సతీష్‌కుమార్, యశ్వంత్‌సింగ్ చౌహాన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆదిలాబాద్‌టౌన్: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరకంగా దృఢత్వంగా ఉంటారని జిల్లా జడ్జి సునీత అన్నారు. గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులకు నిర్వహించిన క్రీడా పోటీలను ప్రారంభించారు. న్యాయవాదులు క్రీడ పోటీల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. కార్యక్రమంలో జడ్జిలు మంజుల, యశ్వంత్‌సింగ్‌చౌహాన్, ప్రమిళ జైన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, ప్రధాన కార్యదర్శి చందుసింగ్, ఉమేష్ డోలే, రహీం, భద్రీశ్వర్‌రావు, సంగీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి సునీత

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి

బేల: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ ఠాక్రే వనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. విద్యుత్ శాఖ ఏఈ సంతోష్ ప్రగతి నివేదిక చదువుతున్న క్రమంలో సిర్సన్న ఎంపీటీసీ నగేష్‌రెడ్డి వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడం లేదని, అధికారులు ఫోన్ చేస్తే ఎత్తడం లేదన్నారు. బెదోడ, భవానీగూడ(సి) సర్పంచ్‌లు విద్యుత్ సమస్యలు వివరించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ గోడం వర్షను ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. సమావేశంలో తహసీల్దార్ బడాల రాంరెడ్డి, ఎంపీడీవో భగత్ రవీందర్, మండల కోఆప్షన్ సభ్యుడు తన్వీర్‌ఖాన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావుత్ మనోహర్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

తాంసి: ఆధ్యాత్మికంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మండలంలోని వడ్డాడి గ్రామంలో 7 రోజులుగా కొనసాగుతున్న శ్రీభవ్య జ్ఞానేశ్వర్ బాజీరావు బాబా సప్తాహ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపులో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో ప్రయనించాలన్నారు. బాజీరావు బాబా స్ఫూర్తితో గ్రామాల్లో సప్తాహం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, పార్టీ కన్వీనర్ అరుణ్, నాయకులు శ్రీధర్ రెడ్డి, వెంకన్న, ఉప సర్పంచ్ షైమీర్, తిరుపతి, హన్మండ్లు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు తిలకించిన ఎమ్మెల్యే..

మండలంలోని లీమ్‌గూడ గ్రామంలో కొనసాగుతున్న కబడ్డీ పోటీలను బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి తిలకించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంభు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, సర్పంచ్‌లు కృష్ణ, గజానన్, యశ్వంత్, రఘు, ఉత్తం, అరుణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

ఆర్‌ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్‌టౌన్: ఆర్‌ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో కలిసి తెలంగాణ రాష్ట్ర ఆర్‌ఎంపీ సొసైటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రామోజీ వీరాచారి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, రాళ్లబండి శంకర్, కావటి రమేష్, ఉమేష్, అశోక్, వెంకట్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి..

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన జర్నలిస్టుల క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ మార్కెట్ వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, గిరిజన జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకుడు గంగారాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

'హక్కుల పరిరక్షణకు పోరాటం'

గుడిహత్నూర్: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ పోరాడుతుందని రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలానికి చెందిన 104 మంది అంగన్‌వాడీలు, అంగన్‌వాడీ హెల్పర్లకు సభ్యత్వం అందజేశారు. కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టి హక్కులను సాధించే వరకు ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్రా దేవేందర్, మండల కార్యదర్శి ఉస్మాన్, అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఛాయా, ఇందు, చంద్రకళ, సురేఖ, సంగీత, లక్ష్మీ, సలీమా పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అగ్ని ప్రమాదం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఐటీడీఏ క్వాటర్‌లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు నివాసంలో శుక్రవారం మధ్యాహ్నం మంటలు రావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న భొజ్జు ఇంటికి చేరుకుని పరిశీలించారు. బెడ్‌రూమ్‌లోని రూ.2లక్షలకు పైగా నగదుతో పాటు 5 తులాల బంగారం, వెండి, కీలకమైన పత్రాలు, సామగ్రి దగ్ధమైనట్లు తెలిపారు. అగ్ని ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ జైవంత్‌రావు, ఐటీడీఏ ఏపీవో జనరల్, ఎస్సై భరత్‌సుమన్, పార్టీ నాయకులు భొజ్జును పరామర్శించారు. సంఘటనకు గల కారణాలు తెలుసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మోసం..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన గాదెవార్ శృతి సైబర్ మోసానికి గురైంది. ఈనెల 18న తన స్నేహితురాలు భువన తన వాట్సాప్‌కు బైనాన్స్ అప్లికేషన్ లింక్‌ను పంపించింది. ఈ యాప్ ద్వారా డబ్బులు రెట్టింపు అవుతాయని తెలుపడంతో ఆమె అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుంది. ఆమెకు డబ్బులు ఇన్వెస్ట్ చేయాలని మెస్సేజ్ రావడంతో రూ.8వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించింది. తాను మోసపోయానని తెలియడంతో శుక్రవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు సైబర్ క్రైం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం అందజేత

గుడిహత్నూర్: మండల కేంద్రానికి చెందిన యువకుడు కుమ్రె సంజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న నేరడిగొండ జడ్పీటీసీ అని ల్ జాదవ్, రాష్ట్ర అధ్యాపకులు సంఘం ప్రధా న కార్యదర్శి బలరాం జాదవ్‌లు వేర్వేరుగా బా ధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయా కార్యక్రమంలో తిరుమల్‌గౌడ్, జమీర్, గుణవంత్‌రావ్ జాదవ్, గజానంద్ గిత్తే, భీంరావ్ జాదవ్, భూమన్న, ఫారూఖ్, సంజీవ్ ముండే, తరుణ్ గిత్తే, తిడికే నితీష్ పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం

ఇచ్చోడ: సంక్రాంతి సందర్భంగా సెల్ఫీవిత్ రంగోళి పోటీల్లో గెలుపొందిన వారికి శుక్రవారం బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సాకాటి దశరథ్ బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి తేజస్విని (కుచులాపూర్) రెండో బహుమతిని బోథ్ మండల కేంద్రానికి చెందిన నయనశ్రీ, మూడో బహుమతి బోథ్ మండలంలోని దన్నూర్ గ్రామానికి చెందిన ఏలేటి హరిని, గెలుపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, మాధవ్ అమ్టె, కదంబాబా రావు, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, కేంద్రే నారాయణ పాల్గొన్నారు.

టీఎల్‌ఎం మేళాలో ప్రతిభ

నార్నూర్: జిల్లాస్థాయిలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో శుక్రవారం గాదిగూడ మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఈవో ప్రణీత అభినందించారు. ఉపాధ్యాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర సెలక్షన్ కమిటీ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి జ్ఞానేశ్వర్, తెలుగు సబ్జెక్టు మండల ఇన్‌చార్జి కల్లి సంతోష్, మాథ్స్ ఇన్‌చార్జి మారోతి, అరవింద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'చర్చి నిర్మాణం ఆపాలి'

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామ పరిసరాల్లోని అసైన్డ్ భూమిలో అక్రమంగా చర్చి నిర్మాణం జరుగుతుందని, వెంటనే అడ్డుకోవాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, హిందూ సంఘాలు, పొచ్చర గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ అతికోద్దిన్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో చర్చి నిర్మాణాన్ని అధికారులు ఆపారని, మళ్లీ నిర్మాణం కొనసాగిస్తున్నారని మండిపడ్డారు.

ఆలయ అభివృద్ధికి కృషి

బేల: ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం బేల మండలం సదల్‌పూర్ భైరందేవ్ మహదేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులను ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి ఆలయ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రైల్వేబోర్డు మెంబర్ జీవీ రమణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్, కిష్టారెడ్డి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

ఇచ్చోడ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో లోక శ్రీనివాస్ రెడ్డి స్మారక షటిల్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది శ్రీనివాస్ రెడ్డి స్మారక షటిల్ పోటీలు నిర్వహిస్తూ.. క్రీడాకారులను ప్రోత్సహిస్తుడడంతో నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, ఎంపీటీసీలు శివకుమార్‌రెడ్డి, జాహెద్, మహిముద్‌ఖాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రీతంరెడ్డి

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపూర్, గౌళిగూడ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాలను సమయానికి తెరుస్తూ తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎక్కడైన కేంద్రాల నిర్వహణ సక్రమంగా లేనట్టు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సిరికొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అన్నారు. మండలం లోని పోన్న అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పిల్లల ఎత్తు, బరువు సరిచూశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. సర్పంచ్ కానిండే చంద్రకళతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న సూపర్‌వైజర్ మంజుల

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న



నోముల పండుగకు హాజరైన మహిళలు

ఆదిలాబాద్‌రూరల్: సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని స్థానిక తాలూకా మున్నూరు కాపు సంఘ భవనంలో శుక్రవారం నోముల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్న, జోగు రమ దంపతులు హాజరై లక్ష్మి దేవీ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరు కాగా వారికి నోములు అందచేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలు ఒకరికొకరు నోములు ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కాళ్ల విఠల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ప్రభ, బొడగం మమత, కస్తాల ప్రేమల, రాధ, పద్మ పాల్గొన్నారు.



నోములు సమర్పిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఘనంగా నోముల పండుగ

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా పెరిక సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో నోముల పండుగను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పెరిక సంఘం భవనంలో ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై ఒకరికొకరు నోములు ఇచ్చిపుచ్చుకున్నారు. సంఘం మహిళా అధ్యక్షురాలు బియ్యాల అనసూయ, మహిళలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలి

ఉట్నూర్‌రూరల్: రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి పెట్టాలని ఎంపీపీ జైవంత్‌రావు అన్నారు. మండలంలోని ఘన్‌పూర్ గ్రామ పంచాయతీలో ఓ రైతు పొలాన్ని సందర్శించి సేంద్రియ ఎరువుల తయారీ విధానం పరిశీలించారు. రసాయన ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతింటుందన్నారు. సహజ సిద్ధంగా తయారైన ఎరువులను వాడటం వల్ల అనేక లాభాలున్నాయన్నారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్న రైతును అభినందించారు.



సేంద్రియ ఎరువులను పరిశీలిస్తున్న ఎంపీపీ

స్టడీ చైర్స్ పంపిణీ

బోథ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం స్టడీ చైర్స్‌తో పాటు ప్యాడ్స్ అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉమేష్ రావు పూర్వ విద్యార్థి ప్రశాంత్ విద్యార్థుల సౌకర్యార్థం ఇటీవల రూ.లక్ష రూపాయలు అందించారు. ఈడబ్బుతో విద్యార్థులకు చైర్స్‌తో పాటు ప్యాడ్స్ అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ గంగుల లక్ష్మి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.